

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 15-04-2026 సంపుటి : 07 సంచిక 315 పేజీలు : 8 వెల : రూ 3-00

# ప్రతీ పౌరుడికీ ఏఐ లాంటి సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలి



అమరావతి, అమరావతిలో తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలోని 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ సహా, మేధా టవర్స్లోని 1 క్యూ క్వాంటం ఫెసిలిటీని ప్రారంభించారు. కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్, డీఎస్టీ సహా వేర్వేరు క్వాంటం కంపెనీల ప్రతినిధులు, ఐఐటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు.చంద్రబాబు మాట్లాడుతూ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో క్వాంటం కంప్యూటర్లను నిర్మించాలని ఇచ్చిన సూచనలతో వీటి నిర్మాణం జరిగింది. దేశానికి, ప్రపంచానికి కావాల్సిన క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు కూడా ఇక్కడే తయారు చేసేలా కార్యాచరణ చేపట్టాం.పూర్తి స్వదేశీ టెక్నాలజీతో ఈ క్వాంటం సిస్టమ్ను నిర్మించి ప్రారంభించుకోవటం ఓ గొప్ప మైలు రాయి. వ్యూహాత్మక టెక్నాలజీల్లో భారత్ ఇక ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేదని భావిస్తున్నాను. దేశీయంగానే క్వాంటం ఉపకరణాలు తయారు చేయటం ఆత్మనిర్భర్ విధానంలో ముఖ్యమైన అంశమని అన్నారు.2047 స్వర్ణాంధ్ర విజన్ లో రూపొందించుకున్న 10 సూత్రాల్లో డీప్ టెక్ కూడా ఓ కీలకమైన అంశం. కృష్ణా నదీ తీరంలో ప్రజా రాజధాని

## ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్ ఎకోసిస్టమ్ను ప్రోత్సాహం తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

అమరావతిని బ్లూ-గ్రీన్ సిటీగా కాలుష్యరహితంగా నెట్ జీరో కాన్సెప్టుతో నిర్మిస్తున్నాం. అమరావతిని శాశ్వత రాజధానిగా పార్లమెంటు కూడా చట్ట సవరణ చేసింది. తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను నిర్మించి అమరావతిని క్వాంటం వ్యాలీగా మారుస్తూ దేశ సామర్థ్యాన్ని పెంచుతున్నాం. తిరుపతిలో స్పేస్ సిటీ, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్, విశాఖలో మెడ్ టెక్, అనంతపురంలో సెమీ కండక్టర్ ఉత్పత్తి కేంద్రాలు అభివృద్ధి చేస్తున్నాం. డేటా సెంటర్ సహా, ఏఐ మౌలిక సదుపాయాలను కూడా త్వరలోనే ప్రారంభించబోతున్నాం. 15 బిలియన్ యూఎస్ డాలర్లతో గూగుల్ అతిపెద్ద పెట్టుబడిని ఏపీలో పెడుతోంది. ప్రతీ పౌరుడికీ ఏఐ లాంటి సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా లక్ష్యమని అన్నారు.డిసెంబరు నుంచి అమరావతిలో క్వాంటం వ్యాలీ కూడా ప్రారంభం అవుతుంది. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ తో పాటు ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్ ను తీసుకురావాలని ఆలోచన చేస్తున్నాం. ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్ ఎకోసిస్టమ్ను ప్రోత్సహిస్తున్నాం. ఐఐటీ చెన్నై, ఐబీఎం సంస్థల భాగస్వామ్యంతో లక్షలాది మందిని క్వాంటం రంగంలో నిపుణులుగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రంలోని 45 లక్షల మందిని ఏఐ, క్వాంటం, సైబర్ డేటా సెక్యూరిటీలో నిపుణులుగా మారుస్తాం. సాంకేతికతను అనుసరించటం కాదు దానిని ఆవిష్కరించే స్థాయికి ఏపి ఎదిగేలా ప్రోత్సహిస్తున్నాం. కొత్త సంస్థలు, నైపుణ్యం, క్వాంటం మౌలిక సదుపాయాలతో భవిష్యత్తును నిర్మిస్తున్నాం. ఔషధాల ఆవిష్కరణ, వ్యవసాయ ఉత్పాదకత, రక్షణ పరిశోధన, లాజిస్టిక్స్ లాంటి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలు వస్తాయని అన్నారు.

# మహానాడు నిర్వహణపై లోకేశ్ కీలక చర్చలు..

## స్థలాల పరిశీలనకు ఆదేశాలు

అమరావతి, ఏప్రిల్ 14 : ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈరోజు(మంగళవారం) మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. లోకేశ్‌తో




భేటీకి ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మరికొందరు కీలక నేతలు హాజరయ్యారు. మేలో జరిగే మహానాడు నిర్వహణపై ప్రధానంగా చర్చించారు.ఈసారి మహానాడును నిర్వహించడానికి శ్రీకాకుళం జిల్లా రణస్థలం, విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఈ ప్రాంతాలను టీడీపీ హైకమాండ్ పరిశీలిస్తోంది. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు ఈ రెండు ప్రాంతాల్లో స్థలాలు పరిశీలించాలని నారా లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల17వ తేదీన మహానాడు స్థల ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటామని లోకేశ్ స్పష్టం చేశారు. మహానాడులోపు పార్టీకి సంబంధించి అన్ని కమిటీల ఎంపికపైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.పార్టీ జాతీయ కమిటీ, రాష్ట్ర కమిటీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులను కూడా ఖరారు చేస్తామని లోకేశ్ తెలిపారు. పొలిట్ బ్యూరోలో కీలక మార్పులు చేయనున్నట్లు వెల్లడించారు. మండల స్థాయి నాయకులను పొలిట్ బ్యూరోలోకి తీసుకోడానికి హై కమాండ్ ఆలోచిస్తోందని అన్నారు. అలాగే, తాజా రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇకపై పొలిటికల్ స్ట్రాటజీపై మరింత దృష్టి పెట్టాలని ఈ సమావేశంలో లోకేశ్ నిర్ణయం తీసుకున్నారు.

# కీలక భేటీకి ఎన్డీఏ సిద్ధం..

## మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రధాన చర్చ

అమరావతి, ఏప్రిల్ 14 : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని నివాసంలో ఎన్డీఏ కూటమి పార్టీల అత్యున్నత స్థాయి సమావేశం సాయంత్రం జరగనుంది. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలతో పాటు జాతీయ స్థాయి ప్రాధాన్యం ఉన్న విషయాలపై కూడా చర్చించనున్నారు.ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమిలోని ఇతర ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం, తదుపరి కార్యాచరణ , రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడనున్నారు.ఈ సమావేశం కేవలం సాధారణ భేటీ మాత్రమే కాకుండా, భవిష్యత్తు రాజకీయ దిశానిర్దేశం చేసేలా ఉండబోతోంది.మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో దీనిపై ప్రజల్లోకి వెళ్లాల్సిన విధానంపై నేతలు చర్చించనున్నారు. మహిళా సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం తీసుకోబోయే వినూత్న కార్యక్రమాలపై ఓ స్పష్టమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయనున్నారు.టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించనున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఉండవల్లిలోని నివాసంలో చర్చల అనంతరం, కూటమి అగ్రనేతలు అందరూ కలిసి మీడియా సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో కూటమి తీసుకున్న కీలక నిర్ణయాలను అధికారికంగా ప్రకటించనున్నారు.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, మహిళా



రిజర్వేషన్ వంటి చారిత్రాత్మక అంశాలపై చర్చించేందుకు మూడు పార్టీల అగ్రనేతలు ఒకే చోట చేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ మధ్య జరిగే ఈ భేటీ భవిష్యత్తు రాజకీయ వ్యూహాలకు వేదిక కానుంది. రేపు సాయంత్రం జరిగే ఈ ఎన్డీయే భేటీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత కీలకం కానుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై కూటమి ప్రభుత్వం ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకుంటుందోనని ఉత్కంఠగా మారింది.

# దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి స్ఫూర్తిదాయకం: ప్రధాని మోదీ



ఢిల్లీ: డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు బాబాసాహెబ్ జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. దేశ నిర్మాణ దిశగా ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఒక న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు ఆయన జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ట్వీట్ చేశారు.మరోవైపు అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ రాష్ట్రాల ప్రముఖ నేతలు నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

# కేంద్రానికి తమిళనాడు సీఎం స్టాలిన్ వార్నింగ్



చెన్నై, ఏప్రిల్ 14: కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ వార్నింగ్ ఇచ్చారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు పాస్ చేస్తే.. భారీ ఉద్యమం చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. రెండు రాష్ట్రాల్లో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి.. బిల్లు పాస్ చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారంటూ కేంద్రంపై ఆయన నిప్పులు చెరిగారు.1960 నాటి డీఎంకేను మళ్లీ పరిచయం చేస్తానంటూ కేంద్రానికి ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై ప్రమాణం చేస్తున్నానని.. తాను చేపట్టే ఉద్యమం తీవ్రంగా ఉంటుందన్నారు. ఇదే తన ఫైనల్ వార్నింగ్ అంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. ఈ మేరు మంగళవారం ఒక వీడియోను సీఎం స్టాలిన్.. తన ఎక్స్ ఖాతా వేదికగా పోస్ట్ చేశారు.చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల ఆమోదం కోసం కేంద్రంలోని మోదీ సర్కార్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందుకోసం ఏప్రిల్ 16,17,18 తేదీల్లో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ సమావేశాల్లో ఈ బిల్లుల ఆమోదం పొందాలనే దృఢ నిశ్చయంతో మోదీ ప్రభుత్వం ఉంది.మరోవైపు దేశంలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగిన సంగతి తెలిసిందే. రెండు రాష్ట్రాలు అసోం, కేరళతోపాటు పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఇప్పటికే ముగిసింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగాల్సి ఉంది.ఏప్రిల్ 23వ తేదీన తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికల పోలింగ్ జరుగుతుండగా.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు.




# సంపాదకీయం

బుధవారం 15-04-2026

## నెక్ట్స్ ఏంటీ...

ఇస్లామాబాద్‌లో జరిగిన అమెరికా?ఇరాన్ చర్చలు ఏ ఒప్పందం లేకుండానే ముగియడంతో, రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక శాంతి సాధ్యమా అనే ప్రశ్నలు మళ్లీ ఉత్పన్నమవుతున్నాయి. ఇరాన్, అమెరికా మధ్య చర్చలు విఫలం కావడంతో.. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉంది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు మరోసారి ఇరాన్‌లోని అణు మౌలిక సదుపాయాలపై దాడులకు తెగబడే ప్రమాదం ఉంది. అదే జరిగితే యుద్ధం మరింత తీవ్రతరం అవుతుంది. హార్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలు తిరిగి ప్రారంభం కాకపోతే.. చమురు రవాణా నిలిచిపోయి ఇంధనం ధరలు భారీగా పెరిగి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడనుంది. యుద్ధం పూర్తి స్థాయికి చేరడం, ఆర్థిక ఆంక్షల కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. ఇస్లామాబాద్ చర్చలు విఫలం కావడంతో.. పశ్చిమాసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. అయితే చర్చల్లో మధ్యవర్తి పాత్ర పోషిస్తున్న పాకిస్థాన్.. పూర్తి స్థాయి యుద్ధం జరగకుండా తన వంతు ప్రయత్నాలు చేయొచ్చు. వాస్తవానికి చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తోంది ఇస్లామాబాద్ అయినప్పటికీ.. తెర వెనుక చక్రం తిప్పుతోంది చైనానే అని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ యుద్ధం వల్ల చైనాకు కొన్ని లాభాలు ఉన్నప్పటికీ.. దాడులు తీవ్రమైతే మాత్రం బీజింగ్‌కు ఆర్థికంగా భారీ నష్టాలు వచ్చే పరిస్థితి ఉ ంటుంది. దీంతో యుద్ధం తీవ్రతరం కాకుండా చూడటానికి చైనాతోపాటు రష్యా ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది. అమెరికా, ఇరాన్ మధ్య మధ్యవర్తి పాత్రను పాకిస్థాన్ పోషించడంతో.. ఆ దేశ ప్రతిష్ఠ పెరిగిందని.. విశ్వగురువుగా చెప్పుకొనే మోదీ మాత్రం సైలెంట్ అయిపోయారని ప్రతిపక్షాలు ఎద్దేవా చేశాయి. భారత్ ఏకాకిగా మారితే.. పాకిస్థాన్ అందరి ప్రశంసలు పొందుతోందనే విమర్శలు వచ్చాయి. అయితే ట్రంప్ మొండి వైఖరి గురించి భారత్‌కు బాగా తెలుసు. అమెరికా అధ్యక్షుడి చేతిలో పాక్ పాలకులు కీలుబొమ్మగా మారిన వైనం కూడా అందరికీ తెలుసు. మరోవైపు తమ అగ్రనేతలను కోల్పోవడంతో ఇరాన్ ప్రతీకారంతో రగిలిపోతోంది. అణు కార్యక్రమం నుంచి పూర్తిగా వైదొలగడానికి ఇరాన్ ఏమాత్రం సుముఖంగా లేదు. అన్నింటికంటే ముఖ్యంగా 140 కోట్ల మందికిపైగా ఉన్న తమ ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత మోదీ సర్కారుపై ఉ ంది. ఇదే భారత ప్రభుత్వం తొలి ప్రాధాన్యం కూడా. అదే సమయంలో యుద్ధం వల్ల తలెత్తే నష్టాలు కూడా భారత్‌కు బాగా తెలుసు. అందుకే చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని అమెరికా, ఇరాన్‌లను పదే పదే కోరింది. కానీ తన ప్రయోజనాలు, ఇరు వర్గాల మొండి వైఖరి, తెర వెనుక చైనా పాత్రను దృష్టిలో ఉంచుకొని మధ్యవర్తిత్వం వహించడానికి భారత్ ముందుకు రాలేదు. అయితే ఇప్పుడు పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం వస్తే మాత్రం భారత్ మరింత చొరవ తీసుకునే అవకాశం లేకపోలేదు. పాకిస్తాన్ ప్రభుత్వ అధికారులు చర్చలకు ముందు ఆశాజనక వ్యాఖ్యలు చేశారు. ఇతరుల కంటే భిన్నంగా తమపై రెండు పక్షాలకూ నమ్మకం ఉందని అన్నారు. అమెరికా ప్రతినిధి బృందం నాయకుడు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఆశావహంగా ఉన్నప్పటికీ, ఆదివారం రాత్రి వరకు జరిగిన చర్చల అనంతరం, ఎటువంటి ఒప్పందం కుదరలేదని ప్రకటించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలు 1979 విప్లవం తర్వాత ఇరాన్?అమెరికా మధ్య జరిగిన అత్యున్నత స్థాయి చర్చలు"అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ ఎప్పుడూ కఠినమైన భాషను ఉపయోగించారు. ఇరాన్ ఓడిపోయిందని, ఇరాన్ లొంగిపోవాలని ట్రంప్ అన్నారు. వాన్స్ కూడా అదే తరహాలో "టెహ్రాన్ మా షరతులకు అంగీకరించాలి" అని అన్నారు. ఎందుకంటే సంఖ్యలను పరిశీలిస్తే, ఇరాన్ గణనీయంగా సైనికులను కోల్పోయింది. వారి అగ్రనేతలు పలువురు హత్యకు గురయ్యారు" అని లీస్ అన్నారు. అయితే ఇరాన్ అలాంటి హెచ్చరికలకు లొంగే అవకాశం చాలా తక్కువని, లొంగిపోయేందుకు సిద్ధపడి ఇస్లామాబాద్ చర్చలకు రాలేదని దూసెట్ చెబుతున్నారు. తాను ఈ యుద్ధంలో ఓడిపోయాననుకుని ఇస్లామాబాద్‌కు రాలేదు, నిజానికి తాను గెలుస్తున్నానని ఇరాన్ భావిస్తోంది. తనకు బలమైన స్థానం ఉందని నమ్ముతోంది. ఇంకా ప్రతిదాడులు చేస్తూనే ఉంది. హార్ముజ్ జలసంధిని కూడా వ్యూహాత్మకంగా ఉపయోగించగలిగింది" అని లీస్ వివరించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చల నుంచి కొన్ని సానుకూల సంకేతాలు ఉన్నాయని బ్రిటన్ మాజీ ఇరాన్ రాయబారి నికోలస్ హాప్టన్ భావిస్తున్నారు."రెండు పక్షాలు ఈ చర్చలను నిర్మాణాత్మకంగా నిర్వహించినట్టుగా కనిపిస్తోంది. రోజులో చాలా సేపు చర్చించారు. ఆ చర్చల్లో సాంకేతిక వివరాలు, అలాగే సాధారణ అంశాలపై కూడా లోతైన చర్చలు జరిగాయి" అని ఆయన అన్నారు. ఇస్లామాబాద్‌లో "గరిష్ఠ డిమాండ్లు" పెట్టుకున్నప్పటికీ, వాటి మధ్య చాలా వ్యత్యాసం ఉన్నప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని చర్చలు జరుగుతాయని రెండు పక్షాలు భావిస్తున్నట్టుగా ఆయన చెబుతున్నారు."చివరికి ఒప్పందం అంటూ కుదిరితే, అది 2015లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా కుదుర్చుకున్న ఒప్పందం కంటే కూడా మరింత సంక్లిష్టంగా, కొత్త అంశాలతో ఉండే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ దఫా చర్చల్లో ఇరాన్ విశ్వాసాన్ని పొందడంలో అమెరికా విఫలమైందని విమర్శిస్తూ, ఇంకా మరిన్ని చర్చలకు అవకాశం ఉందని ఈ చర్చల్లో పాల్గొన్న ఇరాన్ ప్రతినిధి బృందం అధిపతి మొహమ్మద్ గాలిబాఫ్ ట్వీట్ చేసినట్టు నాజీ రాశారు.

## 'అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుతో అంబేద్కర్ నగర్ పేరు సార్థకం'

### సూర్యాపేట మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

సూర్యాపేట, ఏప్రిల్ 14 : తాను పుట్టి పెరిగిన తన 9వ వార్డు అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నది తన చిరకాల వాంచ అని అది నేటితో సఫలమైందని అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుతో అంబేద్కర్ నగర్ పేరు సార్థకమైందని సూర్యాపేట మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్ అన్నారు. భారత



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా 9వ వార్డు అంబేద్కర్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్నతో కలిసి సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. కౌన్సిలర్ గా గెలిచిన తనకు జనరల్ స్థానంలో ఛైర్‌పర్సన్‌గా బాద్యతలు అప్పగించిన అభినవ అంబేద్కరుడు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ ఆశయాలను సాధిస్తూ ఆయన అడుగుజాడల్లో నడువడమే అంబేద్కర్‌కు మనమిచ్చే గొప్ప నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ ఇందుశ్రీ, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, విగ్రహ ఆవిష్కరణ ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు దుబ్బాక సుదర్శన్, ఉపాధ్యక్షులు కొచ్చర్ల శివ, దుబ్బాక జానీ, దుబ్బాక రాజు, అనుముల పరి రాంబాబు, కొచ్చర్ల మహేష్, పగడాల క్రాంతి, అనుములపురి జానకిరాములు, మద్దూరి కుమార్, అనుములపురి నాగరాజు, నిమ్మ ఇంద్రయ్య పాల్గొన్నారు.

## నోయిడా హింస వెనుక భారీ కుట్ర.. పోలీసులపై దాడికి ప్లాన్.. పాక్ హస్తంపై అనుమానాలు

వేతనాల పెంపు కోరుతూ ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాలో కార్మికులు చేపట్టిన నిరసనలు సోమవారం హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఘటనల వెనుక భారీ కుట్ర, ప్లానింగ్ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాదు.. దీని వెనుక పాకిస్తాన్ హస్తం కూడా ఉండొచ్చనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కార్మికుల ఆందోళనలు హింసాత్మకంగా మారడం వెనుకు పాకిస్తాన్ కుట్ర ఉండొచ్చని యూపీ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌బహర్ అన్నారు. ఈ ఘటనల్ని ప్రణాళికాబద్ధంగా జరిగిన కుట్రగా ఆయన అభివర్ణించారు. ఈ విషయాన్ని పోలీసులు తేలుస్తారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకే ఈ ఘటనలు జరిగాయని అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల నోయిడాలోని మీరట్ ప్రాంతంలో నలుగురు ఉ గ్రవాదులు అరెస్టైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ఈ విచారణలో సంచలన విషయాలు బయటపడుతున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఈ హింస వెనుక భారీ కుట్ర, ప్లానింగ్



ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ముందుగా కొందరు కార్మికులు వారం రోజుల క్రితం.. ఫ్యాక్టరీల్లో వేతనాల పెంపు కోరుతూ నిరసన చేపట్టారు. తర్వాత ఈ నిరసనలు వీధుల్లోకి మారాయి. వేల మంది కార్మికులు నిరసనల్లో చేరారు. తర్వాత మరింత ఆందోళనకరంగా మారాయి. పోలీసులపైకి రాళ్లు రువ్వడం, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేయడం, ఫ్యాక్టరీల్ని ధ్వంసం చేయడం, వాహనాల దహనం వంటి ఘటనలు జరిగాయి. అయితే, ఈ ఘటనలు ఉన్నట్లుండి జరిగినవి కావని, వీటి వెనుక భారీ కుట్ర ఉందని పోలీసులు తేల్చారు. ఆందోళనకారులు ఈ ఘటనలకు మూడు రోజుల ముందు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని చాటింగ్, ఆడియో కాల్స్ చేసుకున్నట్లు గుర్తించారు. అందరినీ సమీకరించడం, నిరసనలు తెలపడం వంటి వాటిపై చర్చించుకున్నారు. ఈ డిజిటల్ ఎవిడెన్స్‌ను ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. అలాగే, ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా చాటింగ్ చేసుకున్నట్లు గుర్తించారు. అందులో ఏకంగా మరుసటి రోజు పోలీసులపై ఎలా దాడి చేయాలో కూడా చర్చించారు. పోలీసులపై దాడి చేసేందుకు కారం కూడా తీసుకురావాలని చర్చించుకున్నారు. పోలీసుల దాడుల్లో తమవాళ్లు గాయపడ్డారని, అందుకు బదులుగా మరిన్ని నిరసనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ దాడుల్లో కొందరు మాస్కులు ధరించి పాల్గొనడం కూడా చర్చనీయాంశంగా మారింది. వారిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కార్మికులతో సంబంధం లేని వారు ఈ ఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు పోలీసులు దాదాపు 400 మందిని అరెస్టు చేశారు. 7 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

## రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే పుట్టగతులుండవు : సిఐటియు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 14 : కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా కలిసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే పుట్టగతులుండవు అని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు పెరుమాళ్లపల్లి మోహన్ రావు హెచ్చరించారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వరంగల్ క్రాస్ రోడ్డు కార్ల షోరూం దగ్గర ఆల్ ఆటోమొబైల్ షోరూమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ భారత్ దేశంలో ఉన్న మొత్తం సమాజానికి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని, రాజ్యాంగంలో ఈ దేశంలో బ్రతకటానికి అనేక హక్కులు కల్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేటి పాలకులకు రాజ్యాంగాన్ని చిత్తశుద్ధిగా అమలు చేయకుండా మీనమేషాలు లెక్కించడం జరుగుతుందని విమర్శించారు. ఈ సభలో రైతు సంఘం జిల్లా నాయకుడు వూరడి సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ కార్మికు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు కారుమంచి గురవయ్య, తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల పల్లి శ్రీనివాసరావు, తెలంగాణ గురుకులం ఉపాధ్యాయుల రాష్ట్ర అధ్యక్షుడు దూలం,యలయ్య, ఆటో మొబైల్స్ షోరూమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షుడు నాగ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.వెంటేశ్వరావు, కోశాధికారి ప్రవీణ్, సహాయ కార్యదర్శి బిసి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల, ప్రకాష్, గుగ్గిల వీరబాబు, శ్రీకాంత్, నరేష్, గోవర్ధన్, వసంత బాబు, గోపినాథ్, శేఖర్, మందా వీరబాబు, నాగరాజు, పి.వీరబాబు, వై.రాంబాబు, నక్క శ్రీరాములు, మదు, లింగరాజు, బిల్డింగ్ వర్కర్స్ నాగేశ్వరరావు, శ్రీను, వెంకటేశ్వర్లు, వీరయ్య, హమాలీ నాయకులు సుధాకర్, సోమయ్య, చారి, నాగయ్య పాల్గొన్నారు.



## నల్లగొండలో మే 3న ప్రోమో రన్



నల్లగొండ రూరల్, ఏప్రిల్ 14 : సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో మే 3వ తేదీన నల్లగొండలో నిర్వహించనున్న "నల్లగొండ ప్రోమో రన్" లో ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సొసైటీ జనరల్ సెక్రటరీ మగ్గరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం రన్ పోస్టర్ విడుదల చేశారు. రన్నింగ్, ఫిట్‌నెస్ ప్రాధాన్యతను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం, అలాగే జూన్ 7న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ వద్ద జరగనున్న అవంతికా తెలంగాణ రన్ 2026 కార్యక్రమాన్ని తెలంగాణ అంతటా విస్తరించేందుకు తెలంగాణ రన్ టూర్ లో రాష్ట్రంలోని పలు నగరాల్లో ఇలాంటి ప్రోమో రన్స్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ వాకర్స్ అసోసియేషన్ కమ్యూనిటీ పార్ట్నర్‌గా భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని, మరింత మంది రన్నర్స్, ఫిట్‌నెస్ ప్రేమికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ తరఫున రాఘవ్ సంకోజు పాల్గొన్నారు. అలాగే నల్లగొండ వాకర్స్ అసోసియేషన్ తరఫున బండారు ప్రసాద్, డా. పుల్లారావ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ (మాజీ ) శౌరయ్య , బీమార్జున్ రెడ్డి, కట్టా వెంకటరెడ్డి, గుర్రం వెంకన్న, చింతపల్లి వెంకన్న, శంభు, పవన్, భావన, శ్రీనివాస్‌రావు, కీసరి శ్రీనివాస రెడ్డి, భజరంగ్ పాల్గొన్నారు. రన్ రిజిస్ట్రేషన్ ఈ నెల 25న ముగుస్తుంది కాబట్టి ఔత్సాహికులు తమ పేర్లను నమోదు చేసుకుని విజయవంతం చేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

నాగర్ కర్నూల్: నాగర్ కర్నూల్ జిల్లాలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సస్పెండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు, ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్ మార్గదర్శకాలను పాటించకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ, విధి




నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వంగూరు మండలం పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఎ పంచాయతీ కార్యదర్శి పి.కిషన్, కొల్లాపూర్ మండలం పరిధిలోని సింగోటం గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఎఎ పంచాయతీ కార్యదర్శి పి. అర్జునయ్య, అలాగే కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఎఎ పంచాయతీ కార్యదర్శి ఆర్. ప్రేమచంద్‌లను విధుల నుండి సస్పెండ్ సస్పెండ్ చేశారు. అదేవిధంగా పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన కారణంగా వంగూరు, కొల్లాపూర్ మండలాల పంచాయతీ అధికారులకు షోకాస్ నోటిసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## రేపు కరువొస్తే రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జవాబుదారి అవుతరు : జీవన్‌రెడ్డి

ప్రాణహిత నదీజలాలు వినియోగంలోకి రావాలంటే మీకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాలనే ఆలోచన లేదు..చొరవ లేదు. మిగిలింది మేడిగడ్డను మనం పునరుద్ధరింపజేసుకోవాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాలలోని నివాసంలోఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నిన్నటిదాకా మేడిగడ్డను సాకుగా చూపి కేసీఆర్ దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేసింది. కేసీఆర్ దోషి కాదు.. ఈ తెలంగాణ భవిష్యత్‌ను నిర్మాణం చేసిన స్ఫూర్తి ప్రదాత కేసీఆర్ అని అన్నారు. ఏ విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును, మేడిగడ్డ బ్యారేజ్‌ను పునరుద్ధరింప జేసుకోగలుగుతం. ఈ వేసవితో మూడు కాలాలు గడిచిపోయింది. ఇక మిగిలింది రెండు కాలాలు. ఈ రెండు కాలాల్లో కూడా చేస్తా అంటే అయితదా.. కాదా తెలియదు కానీ చెప్తున్న నేను. ఇంతకాలమైతే ప్రకృతి సహకరించి మనకు కరువు రాలేదు. రేపు భవిష్యత్ ఏమవుతదో తెలియదు. రేపు కరువొస్తే దానికి జవాబు దారి ఎవరైతరు.. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అయితదంటున్నానన్నారు జీవన్ రెడ్డి. కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరింపబడటమే తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు ఏకైన మార్గమంటున్న. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాస్తవానికి అనుగుణంగా కండ్లు తెరిచినందుకు సంతోషంగా ఉందన్నారు జీవన్ రెడ్డి. బీఆర్ఎస్ పార్టీలో నా చేరికతో ఒక నూతన అధ్యాయం మొదలు కాబోతుందని జీవన్ రెడ్డి అన్నారు. కేసీఆర్‌తో నా అనుబంధం ఈనాటిది కాదు.. నేను ప్రజా జీవితంలోకి రాక ముందు నుండి కేసీఆర్ వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా నాకు పరిచయం ఉంది. జీవన్ రెడ్డితో ఉన్న అనుబంధం రాజకీయాలకు అతీతమైనదని కేసీఆర్ కూడా చెపుతూ ఉంటారని జీవన్ రెడ్డి గుర్తు చేశారు.



# మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం



### కేబినెట్ మార్పు చేర్పుల సమీకరణాలు -

విజయవాడ, ఏప్రిల్ 14, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులపై ప్రదర్శిస్తున్న అసహనం కేవలం పరిపాలనాపరమైన కోపమే కాకుండా, రాబోయే భారీ రాజకీయ మార్పులకు సంకేతంగా కనిపిస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఇటీవలి కేబినెట్ సమావేశంలో కేబినెట్ అజెండా మీడియాకు లీక్ అవ్వడంపై ఆయన స్పందించిన తీరు, మంత్రుల పనితీరుపై ఆయన ఇస్తున్న రేటింగ్స్.. త్వరలోనే ఏపీ మంత్రివర్గంలో మార్పుచేర్పులు ఉండబోతున్నాయనే అంచనాలను బలపరుస్తున్నాయి సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో, అజెండాలోని కీలక అంశాలు అధికారికంగా వెల్లడించక ముందే మీడియాలో రావడంపై చంద్రబాబు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన దివంగత ఎన్టీఆర్ హయాంలో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేశారు. బడ్జెట్ వివరాలు లీక్ అయినందుకు ఎన్టీఆర్ మొత్తం మంత్రివర్గాన్నే రద్దు చేసిన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. గోప్యత పాటించలేని మంత్రులు ఉంటే ఎంత, లేకపోతే ఎంత అని నిలదీశారు. ఇది మంత్రులకు ఇచ్చిన ఆఖరి హెచ్చరికగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తోంది . సాధారణంగా చంద్రబాబు తన గత అనుభవాల దృష్ట్యా, ప్రభుత్వం సగం కాలం పూర్తి చేసుకునే సమయానికి మంత్రుల పనితీరుపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేస్తారు. ప్రస్తుతం మంత్రుల గ్రాఫ్, ప్రజల్లో వారి ఇమేజ్, శాఖలపై పట్టు వంటి అంశాలను ఆయన నిశితంగా గమనిస్తున్నారు. ఎవరైతే ఆశించిన స్థాయిలో పని చేయడం లేదో, వారిని తప్పించి కొత్త రక్తానికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నాలుగు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావిస్తున్న బాబు, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసేందుకు సమర్థులైన నేతలకు మంత్రి పదవులు ఇవ్వాలని భావిస్తున్నారు. కేబినెట్ అజెండాను కూడా ముందస్తుగా చదువుకోకుండా వస్తున్న మంత్రులపై ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఎన్నికల సమయానికి ప్రజల్లో మంచి మైలేజ్ ఉన్న నేతలతో కూడిన కొత్త టీమ్ ను రంగంలోకి దించే అవకాశం ఉంది. అజెండా కాపీలు ఎవరు లీక్ చేస్తున్నారో, ఏ మంత్రులు మీడియా ప్రతినిధులతో అతిగా సాన్నిహిత్యం నెరుపుతున్నారో తనకు తెలుసని చంద్రబాబు సంకేతాలిచ్చారు. ఇది మంత్రులలో ఒక రకమైన భయాన్ని కల్పించింది. కేవలం లీకులే కాకుండా, శాఖా పరమైన నిర్ణయాల్లో జాప్యం, కేంద్ర పథకాల అమలులో నిర్లక్ష్యం వంటివి కూడా బాబు అసహనానికి కారణమయ్యాయి. ఈసారి మంత్రివర్గ మార్పుల్లో నారా లోకేష్ మార్క్, అలాగే కూటమి ధర్మం ప్రకారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనలు కూడా కీలకం కానున్నాయి. యువ నేతలకు ప్రాధాన్యత పెంచడం, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడం ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వంటి అంశాల ఆధారంగా కొత్త మంత్రుల ఎంపిక ఉండవచ్చు. పనితీరు బాలేని సీనియర్లను పార్టీ బాధ్యతలకు పరిమితం చేసి, చురుకైన వారిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం మెండుగా ఉంది. చంద్రబాబు సీరియస్ లుక్ వెనుక ఒక పెద్ద క్లీనింగ్ ప్రాసెస్ దాగి ఉందని అర్థమవుతోంది. పరిపాలనలో క్రమశిక్షణ తప్పితే ఎంతటి వారినైనా తప్పిస్తాననే సందేశాన్ని ఆయన బలంగా పంపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే లేదా రెండేళ్ల పాలన ముగిసిన వెంటనే ఏపీ కేబినెట్‌లో భారీ మార్పులు జరగడం దాదాపు ఖాయమని చెప్పవచ్చు.

# 15న జలధార అవగాహన కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలి

### కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

బద్వేలు ,జలమే సంపద, జలమే జీవనాధారం.. అన్న సత్యాన్ని ప్రజలు గుర్తెరిగేలా.. 15వ తేదీన జలధార అవగాహన కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో.విధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు.బద్వేలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా.. సోమవారం రాత్రి బద్వేలు ఆర్డీవో కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి.. 'జలధార.. నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత' అమలు ప్రణాళికపై ఈ నెల న్15న అవగాహన కల్పించే కార్యక్రమంపై.. సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో నీటి భద్రత అందరి బాధ్యతగా భవించాలన్నారు. నీటి భద్రత మన అందరి సమిష్టి బాధ్యత అని, ఈ విషయంలో జిల్లాలోని సాగు నీటి సంఘాల బాధ్యత అత్యంత కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టడం జరుగుతోందన్నారు. జలధార కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 15న ప్రతి గ్రామంలో జల చిత్రపటం ఆవిష్కరణ చేసి.. గ్రామంలో ప్రతీ ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తూ.. అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జలాధార కార్యక్రంలో నీటి వనరుకు సంబంధించి చర్చ జరగాలన్నారు. భూగర్భజల శాఖ వారు అందించే.. ఒక వాటర్ ఆడిట్ రిపోర్టు ఆధారంగా ప్రతి గ్రామంలో, గ్రామ సచివాలయంలో విలేజ్ టెక్నీకల్ అసిస్టెంట్ సహాయంతో.. జల వనరులకు సంబంధించి జల చిత్ర పటాన్ని తయారు చేయాలన్నారు. 15వ తేదీన ఉదయం 10 గంటలకు... జలాధార కార్యక్రమ ఉద్దేశ్యాన్ని చిత్రీకరించాలన్నారు. ఆ గ్రామంలో ప్రధాన నీటి వనరు, చెరువులు, కాలువల అనుసంధానం ఉందా, ఫీడ్ ఛానెల్స్ వున్నాయా ? అనే అన్ని అంశాలకు సంబంధించి.. రాంగోలి చిత్రంగా ఏర్పాటు చేసి.. గ్రామస్తులను ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల లాంటి భాగస్వాములతో ఈ తరహా కార్యక్రమాలను మరింత ప్రధాన్యతతో పటిష్టంగా చేపట్టాలన్నారు. అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు, వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం.. తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాగునీటి సంఘాలను పటిష్టం చేసే దిశగా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ కార్యాలయం నుండి ఆర్డీవో చంద్రమోహన్, డ్వామా, డీఆర్డీఏ, భూగర్భ జల, మైనర్ ఇరిగేషన్ సంబందిత అధికారులు హాజరవ్వగా... మండలాల నుండి డ్వామా సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో కొత్తగా మరో 30 ఇండస్ట్రియల్ క్లస్టర్లు

కడప, ఏప్రిల్ 14, ఏపీ ప్రభుత్వం మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట కొత్తగా మరో 30 ఇండస్ట్రియల్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేసింది. గతంలో 20 కస్టర్లు ఏర్పాటు చేయగా.. వాటికి తోడు మరో 30 కలిపి మొత్తం 50 రానున్నాయి. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనల్ని కేంద్రానికి కూడా పంపింది. ఇప్పటికే ఆయా జిల్లాల్లో భూముల్ని కూడా గుర్తించారు అధికారులు. ఆంధ్రప్రదేశ్ మీదుగా కేంద్రం మూడు ఇండస్ట్రియల్ కారిడార్లను అభివృద్ధి చేస్తోంది. విశాఖపట్నం-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయి. విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ మొదటి దశ పనులు ముగింపు దశకు చేరాయి. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నోడ్‌లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. హైదరాబద్-బెంగళూరు కారిడార్ పరిధిలోని అనంతపురం, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక నోడ్‌లను అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే ఈ మూడు కారిడార్ల వెంట 20 ఇండస్ట్రియల్ కస్టర్లను ప్రభుత్వం అభివృద్ధం చేసింది. వీటితో పాటుగా మరో 30 క్లస్టర్లను అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకుంది. ఈ మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట 30 ఇండస్ట్రియల్ కస్లర్టలను అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 20 క్లస్టర్లకు ఈ 30 కలిపితే 50 క్లస్టర్లు అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు. కొత్తగా తెరపైకి తీసుకొచ్చిన ఈ 30 క్లస్టర్ల కోసం అధికారులు దాదాపు 1.31 లక్షల ఎకరాల భూమిని కూడా గుర్తించినట్లు తెలుస్తోంది. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన క్లస్టర్లు.. శ్రీకాకుళం జిల్లాలో 2, విశాఖపట్నం జిల్లాలో 4, కృష్ణాలో 1, గుంటూరు జిల్లాలో 1, నెల్లూరు జిల్లాలో 3, తిరుపతి జిల్లాలో 5, చిత్తూరు జిల్లాలో 4, అనంతపురం జిల్లాలో 3, శ్రీసత్యసాయి జిల్లాలో 1, కడప జిల్లాలో 3, కర్నూలు జిల్లాలో 1, ప్రకాశం జిల్లాలో 2 ఉన్నాయి. ఈ ఇండస్ట్రియల్ క్లస్టర్లను పొరుగు రాష్ట్రాల్లోని ప్రధాన రాష్ట్రాలకు కనెక్ట్ చేసేలా ప్లాన్ చేస్తోంది. రాష్ట్రంలో ఈ మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట దాదాపు 74,583 ఎకరాల ముంపు భూముల్ని గుర్తించి వాటిలో 27వేల ఎకరాలను సేకరించారు. తీర ప్రాంతం వెంట దాదాపు 56,608 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.. ఇప్పటికే 36వేల434 ఎకరాలను సేకరించింది. ముంపు ప్రాంతాల్లో 15.. తీర ప్రాంతం వెంట మరో 15 క్లస్టర్లు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ భూముల్ని ఇండస్ట్రియల్ క్లస్టర్ల కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రధానంగా మారిటైంకు సంబంధించిన పరిశ్రమల్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ క్లస్టర్ల ఏర్పాటుపై ప్రతిపాదనల్ని కేంద్రానికి పంపారు.. కేంద్రం అవసరమైన నిధులు కేటాయించనుండగా.. కొంత వాటాను ఏపీ ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.

## సింగపూర్ ట్రైనింగ్ మంత్రులు

విజయవాడ, ఏప్రిల్ 14, ఈ నెల 21 నుంచి 27 వరకు తొమ్మిదిమంది మంత్రులు సింగపూర్‌లో పర్యటిస్తారు. తొమ్మిదిమంది మంత్రుల్లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ, వ్యవయసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, ఆర్ అండ్ బీశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నారు. ఈ తొమ్మిది మంత్రులతో పాటుగా ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి సీనియర్ అధికారులు కూడా సింగపూర్ వెళ్లబోతున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, సుపరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలతో పాటుగా ఇతర అంశాలపై నైపుణ్యాలు పెంచుకునేందుకు శిక్షణ కోసం మంత్రులు సింగపూర్ వెళ్లబోతున్నారు. ఈ పర్యటనలో మంత్రులకు ప్రతిరోజూ ఒక ప్రత్యేక అంశంపై శిక్షణ ఉంటుంది. ఈ తొమ్మిదిమంది మంత్రులు సింగపూర్‌లో శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ ఇచ్చే లీడ్ ట్రైనర్లుగా వ్యవహరిస్తారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన స్వర్ణాంధ్ర 2047 విజన్ అమలులో భాగంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. మొదటిరోజు మంత్రులకు నేషనల్ ఫస్ట్ అంశంపై శిక్షణ ఉంటుంది.. ఈ అంశంపై నిపుణులు వివరిస్తారు. రెండో రోజు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు దగ్గరయ్యే అంశంపై ట్రైనింగ్ ఉంటుంది. మూడో రోజు అత్యవసర పరిస్థితులు ఎదురైతే.. ఆ సంక్షోభాలను ఎలా ఎదుర్కోవాలో శిక్షణ ఉంటుంది. నాలుగో రోజు డిజిటల్ గవర్నమెంట్, సాంకేతిక పరిజ్ఞానం అమలుపై ట్రైనింగ్ ఇస్తారు. ఐదో రోజు ఆర్థిక వృద్ధిపై శిక్షణ ఉంటుంది..

## కాశీ యాత్రలో గాయపడ్డ బి. యాలేరు గ్రామస్తులు

అనంతపురం,అనంతపురం,కాశీ యాత్రకు వెళ్లిన ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన పలువురు ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందించి.. వారికి మెరుగైన వైద్యం అందించి స్వస్థలానికి చేర్చే విధంగా చర్యలు చేపట్టారు. ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన 48మంది గ్రామస్తులు బస్సులో కాశీయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో భాగంగా కాశీ గోపిగంజ్ టోల్గేట్ కి 59 కిలోమీటర్ల దూరంలో ఒక రోడ్డు ప్రక్కన వంట చేసుకునేందుకు బస్సును ఆపారు. రోడ్డుకు చాలా దూరంలో వంట చేసుకుంటుండగా.. ఒక టిప్పర్ వాహనం వేగంగా వచ్చి బస్సును ఢీకొంది. బస్సు సమీపంలో వంట చేస్తున్న వారిపై దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఏడు మంది గాయపడ్డారు. వెంటనే వారిని సమీపంలోని గోపీగంజ్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందించారు. అక్కడున్న యాత్రికులతో మాట్లాడి ఏం జరిగిందన్నది తెలుసుకున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ దృష్టికి ఈ ప్రమాద ఘటనను తీసుకెళ్లి.. బాధితులకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు వారిని స్వస్థలాలకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి మేరకు కలెక్టర్ కూడా వెంటనే స్పందించి తన మిత్రుడైన అక్కడి జిల్లా కలెక్టర్ తో మాట్లాడారు. బాధితులంతా క్షేమంగా ఉన్నారని కేవలం 7 మందికి మాత్రమే గాయాలైనట్లు ఎమ్మెల్యే సునీత తెలిపారు. వారిని స్వస్థలానికి తీసుకొచ్చే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు. గ్రామస్తులు కానీ వారి బంధువులు కానీ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. కాశీ ప్రయాణానికి వెళ్లిన వారంతా సురక్షితంగా ఉన్నట్లు సునీత తెలిపారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించిన తెలుగుదేశం పార్టీ నాయకులు


మైలవరంమైలవరంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు, శాసనసభ్యుని కార్యాలయం నందు గల అంబేద్కర్ చిత్రపటానికి, మైలవరం మాలపల్లి ఆదంపురం లొ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, విఘ్నేశ్వర హోటల్ ఎదురుగా గల అంబేద్కర్ విగ్రహములకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగు యువత ఆధ్వర్యంలో పూలమాలలు వేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినారు...ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ మాట్లాడుతూ చిన్నతనం నుండి ఎన్నో ఇబ్బందులు పడుతూ జీవితములో అంటరానితనం,కుల వివక్షత ఎదుర్కొని, ఉన్నతమైన చదువులు చదివి భారత రాజ్యాంగ నిర్మాణంలో భాగమై కులం మతాలకు అతీతంగా భారతదేశంలోనే గర్వించదగ్గ, కొనియాడదగిన నాయకుడుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి నిలిచారని ఆయన పోరాటం ఆయన ఆసియా సాధనను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి మనిషి ఉన్నతమైన చదువులు చదివి, ఉన్నతమైన స్థానంలో నిలవాలని, అంబేద్కర్ గారి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని జీవించాలన్నారు. భారతదేశంలోనే అత్యధిక ఆధారణ, అభిమానం కలిగిన నాయకులలో ప్రథమ స్థానంలో ఉన్నారన్నారు. అందుకనే అంబేద్కర్ ని భారత దేశ ఐకానిక్ స్టార్ అంటారన్నారు...

## అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్

### రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### ఘనంగా బాబాసాహెబ్ కు నివాళి

విజయనగరం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు విజయనగరంలో ఘనంగా జరిగాయి. ?మంగళవారం స్థానిక బాలాజీ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ఎంఎస్‌ఎమ్‌ఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా ఇంచార్జి కలెక్టర్ సేధు



మాధవన్, విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్పర్సన్ పాలవలస యశస్వి, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, మున్సిపల్ కమిషనర్ బాలాస్వామి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి ఎం.అన్నపూర్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడి వెంకటేశ్వరరావు, ఇతర ఉన్నతాధికారులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి దిశానిర్దేశం చేసే అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగంలోని రైట్ టు లివ్, రైట్ టు ఈక్వాలిటీ, రైట్ టు స్పీచ్ వంటి ప్రాథమిక హక్కుల వల్ల సమాజంలో ప్రతి వర్గానికి, ప్రతి కులానికి సమానత్వం మరియు గౌరవం లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ?చిన్నతనంలో తాను ఎదుర్కొన్న వివక్షను మరెవరూ ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ నిరంతరం శ్రమించారని గుర్తుచేశారు. నేడు వెనుకబడిన వర్గాల కుటుంబాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయంటే అది ఆయన కల్పించిన రాజ్యాంగ ఫలాలేనని స్పష్టం చేశారు. ప్రతి ఏటా ప్రభుత్వం తరపున ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, భావితరాలకు ఆయన ఆశయాలను, గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.

## వైసీపీ సెంటిమెంట్ వర్కౌటవుతుందా

నెల్లూరు, ఏప్రిల్ 14, సీపీ సెంటిమెంట్ తో జనం ముందుకు వెళుతుంది. అది ఎంత వరకూ సక్సెస్ అవుతుందో తెలియదు కానీ... ప్రాంతాల వారీగా వైసీపీ ఆ ప్రాంత ప్రధాన సమస్యలపై ఉద్యమం చేస్తూ తిరిగి పుంజుకోవాలని చూస్తుంది. చూసేందుకు ఇది మంచి స్ట్రాటజీలాగే కనిపిస్తుంది. దీంతో ఆ ప్రాంత నేతలు బయటకు వస్తున్నారు. అలాగే ప్రజల్లోకి కూడా పార్టీ బలంగా వెళ్లగలుగుతుంది. అంటే రెండు రకాలుగా పార్టీకి ప్రయోజనమేనని అంటున్నారు. జగన్ నిర్దేశించిన మేరకు ఇటు రాయలసీమలోనూ, అటు ఉత్తరాంధ్రలోనూ వేర్వేరు సమస్యలపై వైసీపీ పోరాటం చేయడం రానున్న ఎన్నికల్లో తమకు కలసి వస్తుందని వైసీపీ గట్టిగా భావిస్తుంది. ఉత్తరాంధ్రలో ఇటీవల మూలాపేట పోర్టు నిర్మాణాన్ని నిలిపివేయడంపై వైసీపీ నేతలు ఆందోళనకు దిగారు. తాము అధికారంలో ఉండగా 70 శాత పనులు పూర్తి చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూలాపేట పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయకుండా నిధులన్నీ అమరావతి నిర్మాణానికే ఖర్చు పెడుతుందని సెంటిమెంట్ ను ఆ ప్రాంత ప్రజల్లో కలిగించేలా నేతలు మాట్లాడారు. నిధులన్నీ ఒక్క ప్రాంతానికే ఖర్చు చేస్తే మిగిలిన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయని వారు ప్రశ్నిస్తూ గత ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో కోల్పోయిన పట్టును తిరిగి సంపాదించే పనిలో వైసీపీ పడిందని భావించాలి. మరొకవైపు రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వైసీపీ ఇటీవల ఆందోళనకు దిగింది. తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడికి సీమ ప్రాంత ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ సీమలోని అన్ని జిల్లాల్లో సభలను, సమావేశాలను, ఆందోళనలను నిర్వహిస్తున్నారు. అన్నీ ఒకే చోట కేంద్రీకరిస్తూ, చివరకు రైతుల ప్రయోజనాలను కూడా పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు జనంలోకి వెళుతున్నారు. ఇలా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వేర్వేరు సమస్యలపై ప్రజల్లోకి వెళుతూ ఆందోళనలు చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని చేస్తున్న ప్రయత్నం ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి.

## రాజకీయ ప్రత్యర్థులు... వ్యాపారంలో మిత్రులు

విశాఖపట్టణం, ఏప్రిల్ 14,ధికార టిడిపిలో మిలాఖత్ రాజకీయాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీకి చెందిన మాజీ నాయకులతో చేతులు కలిపి పలు వ్యాపారాలు చేస్తున్నట్టు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు అందాయి. ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క రకంగా కొంతమంది నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇట్లాంటి రాజకీయాలను సహించేది లేదని కూడా ఆయన తేల్చి చెప్పారు. అంతేకాదు ప్రస్తుతం తెరమీదకు వచ్చిన అనేక అంశాలను ఆయన ప్రస్తావిస్తూ భవిష్యత్తులో ఇట్లాంటి రాజకీయాలు చేసే వారిని పక్కన పెడతానని కూడా హెచ్చరించారు. ఈ పరిణామం టిడిపిలో తీవ్ర చర్చనీయాంసంగా మారింది. అలాగని చంద్రబాబు చెప్తున్నట్టుగా ఇప్పటికి ఇప్పుడు వైసీపీ నాయకులను వదిలేసే పరిస్థితి కనిపించడం లేదు. ఉదాహరణకు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో వైసిపి మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మద్యం వ్యాపారం చేస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి తెలియకుండా చక్రం తిప్పుతున్నారని వార్తలు వచ్చాయి. ఇక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైస్ మిల్లింగ్ వ్యాపారంలో కూడా వైసీపీకి చెందిన మాజీ మంత్రులు నేతలతో నాయకులు మిలాఖత్ అయ్యారని ప్రభుత్వానికి సమాచారం చేరిందిఅలాగే ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూడా వైసీపీ మాజీ మంత్రితో కలిసి కొందరు టిడిపి ఎమ్మెల్యేలు వ్యాపారం చేస్తున్నారని సమాచారం. ఇక ఉత్తరాంధ్రలోనూ ఇటువంటి రాజకీయాలకు కొదవ లేకుండా పోయింది. మొత్తంగా చూస్తే రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు చెబుతున్న దానికి భిన్నంగా కొందరు నాయకులు అడుగులు వేస్తున్నారు. అయితే ఇలాంటి సందర్భంలో వివాదాలు వచ్చినప్పుడు మాత్రమే నాయకుల పేర్లు బయటకు వస్తున్నాయి. మిగిలిన చోట్ల సర్దుకుపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల విశాఖపట్నంలో ఓ కీలక కంపెనీకి భూములు సేకరించే అంశం వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైసిపి నేత సహాయం తీసుకుని రైతులను ఒప్పించిన వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. అయితే ఇది మంచి పరిణామం కాబట్టి ప్రభుత్వం కూడా పెద్దగా పట్టించుకోలేదు. అయితే తర్వాత కాలంలో ఏ మాజీ మంత్రితో చేతులు కలిపి భూములు ఇప్పించారో అదే మాజీ మంత్రితో కలిసి ఇసుక వ్యాపారంలో సదరు టిడిపి నాయకులు పనిచేస్తున్నారని తెలిసి పార్టీ అధిష్టానం విస్మయానికి గురైంది. దీంతో అటు ఎవరిని ఏమీ అనలేక ఇటు సమర్ధించుకోలేక క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులపై పార్టీ అంతర్మథనం చెందుతోంది. ఇది ఎన్నాళ్లు కొనసాగుతుందనేది చూడాలి.

# నంద్యాలలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 14:-నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి వెలిగించి జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు.మంత్రి ఫరూక్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకమని, సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన చూపిన మార్గంలో నడవాలని అన్నారు. నంద్యాలలో అంబేద్కర్ భవనం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అంబేద్కర్ గారి సేవలు చిరస్మరణీయమని, యువత విద్యను ఆయుధంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మంత్రి కేక్ కట్ చేసి అధికారులకు నాయకులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న. ఎన్.ఎం.డి ఫిరోజ్, ఆర్డీఓ విశ్వనాథ్. ఎమ్ఈ గురప్ప యాదవ్, డీఈలు, టౌన్ ప్లానింగ్ అధికారి, ఆర్ఓ వెంకటరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు, శానిటేషన్ సూపర్‌వైజర్ శివప్రసాద్ రెడ్డి, టీడీపీ కౌన్సిలర్లు, వివిధ సంఘాల నాయకులు. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం--

## మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 14 :- అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపు అత్యవసరమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం నంద్యాల టెక్కే మార్కెట్ యార్డ్‌లో అగ్నిమాపక వారోత్సవాలను మంత్రి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను ముందుగానే నివారించేందుకు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పాఠశాలలు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించి ప్రజల్లో అప్రమత్తత పెంచాలని తెలిపారు. భారీ భవనాలకు ఫైర్ సేఫ్టీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, ఎమర్జెన్సీ మార్గాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గృహాల్లో విద్యుత్, గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సేవలను అభినందించారు.కార్యక్రమంలో ఫైర్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అయ్యలూరులో అంబేద్కర్‌కు ఘన నివాళులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 14:అయ్యలూరు గ్రామ సచివాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్, నంద్యాల అర్బన్ తహశీల్దార్ శ్రీనివాసులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన, అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఉద్యోగి ఆచరణలో పెట్టాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా అయ్యలూరు గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



# మహానందిలో అంబేద్కర్‌కు ఘన నివాళులు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 14:శ్రీశైలం నియోజకవర్గం మహానంది మండలం బుక్కాపురం మజారా పుట్టుపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ నాయకుడు మారెడ్డి రామయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతిని జరుపుకున్నారు.ఈ సందర్భంగా మారెడ్డి రామయ్య మాట్లాడుతూ ఆధునిక భారతదేశానికి రాజ్యాంగం ద్వారా దిశానిర్దేశం చేసిన మహనీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. రాజకీయం అంటే కేవలం అధికార సాధనమే కాకుండా సామాజిక మార్పుకు శక్తివంతమైన సాధనమని ఆయన విశ్వసించారని తెలిపారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లే సామాన్య ప్రజలకు రాజకీయాల్లో భాగస్వామ్యం కలిగిందని, ఓటు హక్కు ద్వారా సామాన్యుడిని రాజుగా నిలబెట్టిన మహానుభావుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు.అంబేద్కర్ ఆశయాలను కేవలం జయంతి రోజుల్లోనే కాకుండా ప్రతిరోజూ మన జీవితాల్లో, పాలనలో అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బుక్కాపురం గ్రామ పంచాయితీ సెక్రటరీ నాగేంద్ర నాయక్, వీఆర్వో అక్బర్, జనసేన నాయకులు తిరుపాల్, దేవరాజు, భాస్కర్, శివ, బాల ఓబులేసు, రాహుల్, భూపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి,ఘన నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ.



విభారే న్యూస్ ఏప్రిల్ 14 కర్నూలు జిల్లా ప్రతినిధి.. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కర్నూలు నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా దేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేశారన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.ప్రతి ఒక్కరూ డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో న్యాయం,సమానత్వం, సౌభ్రాతృత్వం విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలని కర్నూలు ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు సీఐలు మధుసుధన్ రావు, మన్సురుద్దీన్, నాగరాజారావు, మారుతి శంకర్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే దేశానికి దిక్సూచి...

## -- రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే ఇక సమరమే!



.విభారే న్యూస్ ఎమ్మిగనూరు ఏప్రిల్ 14.. దళిత,క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించేలా పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలి.ఎస్సీ బేడ,బుడగ జంగాలకు అడ్డుగా ఉన్న జీవో 144 ను తక్షణమే రద్దు చేయాలి.బుడగ జంగాల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటండా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ సభలో దళిత నేతలు ఉద్ఘాటన.ప్రపంచ మేధావి, దళిత, బహుజనుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే దేశానికి దిక్సూచి అని అయితే నేటి పాలకులు రాజ్యాంగాన్ని అమలు చేయకుండా ఉల్లంఘిస్తూ... బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని, దళితులు క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు అని గౌరవ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం సరికాదని ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం దళిత,క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించేలా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటి కన్వీనర్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కె. వి.పి.యస్) కర్నూలు జిల్లా అధ్యక్షులు యస్.దేవ సహాయం,జయంతి ఉత్సవ కోర్ కమిటి సభ్యులు ఎల్.ఐ.సి. పరిగెల భాస్కర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న, దళిత రచయితల సంఘం (ద.ర.సం) వ్యవస్థాపక అధ్యక్షులు ఆరెకంటి భాస్కర్ లు డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మార్వో ఆఫీస్ ఆవరణంలో జయంతి ఉత్సవ కమిటి చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ బేడ, బుడగ జంగాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎర్రకోట సంకుల మహాలింగప్ప బుడగ జంగం అధ్యక్షతన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135 జయంతోత్సవ సభ వేలాది మందితో ఘనంగా జరిగింది. ఈ సభకు ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసిసి) రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ సామాజికవేత్త డా. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు విశిష్ట అతిథిగా హాజరై డిమాండ్ల సాధనకు సంఘీభావం తెలియజేసి ప్రసంగించారు.ఈ సభలో వక్తలు ఆలోచన పూర్వకంగా, ఆవేశ పూర్వకంగా కూడిన ప్రసంగాలతో సభ మారు మోగింది. ముందుగా పట్టణంలోని ఎం.బి.చర్చి నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ఎత్తున నీలి ర్యాలీ నిర్వహించారు. ఊరేగింపులో వందల సంఖ్యలో డప్పులతో దరువు వేయడంతో ఎమ్మిగనూరు పట్టణం డప్పుల మోతలతో దద్దరిల్లిపోయింది. అడుగడుగునా దళిత, గిరిజనులు బాణాసంచా పేలుస్తూ యువకులు చేసిన కర్ర సాము విన్యాసాలు పట్టణ ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ సర్కిల్ కు చేరుకొని 9 అడుగుల నిలువెత్తు కాంస్య విగ్రహానికి గజమాలతో ఘన నివాళులర్పించారు. సభలో ప్రముఖ కళాకారులు వర్కూరు గ్రామానికి చెందిన కత్తి రంగన్న, డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గోనెగండ్ల కరుణాకర్ ల ఆధ్వర్యంలో పాడిన పాటలు సభికులను ఆకట్టుకోవడం విశేషం. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మేకలుగా ఉన్నంతకాలం నిమ్న జాతులను బలిస్తూనే ఉంటారని హక్కుల సాధన కోసం,అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పరిరక్షణ కోసం దళిత,గిరిజనులు సింహాలై గర్జించాలని పిలుపునిచ్చారు.భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల లో భాగమైన మత స్వాతంత్ర్యపు హక్కు ఆర్టికల్ 25-28 ప్రకారం భారతదేశ పౌరుడు ఎవరి ఇష్టానుసారం వారు ఏ మతాన్ని అయినా అనుసరించే,ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కు కల్పించిందన్నారు.మత స్వేచ్ఛను కుల హక్కులతో అనుసంధానం చేసి బంధించడం సరికాదని దుయ్య బట్టారు. దళిత, గిరిజనులు మతం మారినంత మాత్రాన సామాజికంగా ఎదుర్కొనే వివక్ష, అంటరానితనం పూర్తిగా తొలగి పోలేదని ఆవేదన చెందారు.దళిత, క్రైస్తవులపై సుప్రీంకోర్టు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మత స్వేచ్ఛ,సమానత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగం విలువలపై ప్రభావం చూపే అంశంగా మారిందని పేర్కొన్నారు. కేంద్రం జోక్యం చేసుకొని సుప్రీం తీర్పు పునః సమీక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత, క్రైస్తవుల స్థితిగతులపై కేంద్ర ప్రభుత్వం నియమించిన భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ నేతృత్వంలోనే త్రిసభ్య కమిషన్ నివేదికను బహిర్గతపరిచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ 59 ఉప కులాలలో ఒకరైన బేడ,బుడగ జంగాలకు విద్య,ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అడ్డుగా ఉన్న జీవో 144 ను తక్షణమే రద్దు పరచి వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి వారి జీవితాలలో వెలుగులు నింపాలని కేంద్ర, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన లోకూర్ జాతీయ కమిషన్, జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్, జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్, మోతిలాల్ బి నాయక్ ఏక సభ్య కమిషన్ , రిటైర్డ్ ఐఏఎస్ జెసి శర్మ, ఎస్సీ వర్గీకరణ పై నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజాన్ మిశ్రా కమిటి లు ఎస్సీ బేడ బుడగజంగాలు రాయలసీమ జిల్లాలలో ఉన్నారని ప్రభుత్వాలకు నివేదికలు సమర్పిస్తున్నప్పటికీ బేడ, బుడగ జంగాల పట్ల అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారు

# తహశీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్‌కు ఘన నివాళి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 14:నంద్యాల అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి తహశీల్దార్ శ్రీనివాసులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగానికి పునాది వేసిన మహనీయుడని, సమాజంలో సమానత్వం, న్యాయం, హక్కుల పరిరక్షణ కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని, ప్రభుత్వ అధికారులు అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.అనంతరం డిప్యూటీ తహశీల్దార్ రామ సంజీవరావు, సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహశీల్దార్ శేఖర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాదు తదితరులు మాట్లాడుతూ అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. దేశ నిర్మాణంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, సమాన హక్కుల కోసం ఆయన చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, ఇతర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం గౌరవప్రదంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.

# లయన్స్ క్లబ్, కళారాధన నుంచి అంబేద్కర్‌కు నివాళి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 14:- భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్, కళారాధన ఆధ్వర్యంలో స్థానిక కళారాధన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక న్యాయ పోరాట యోధుడిగా, రాజ్యాంగ నిర్మాతగా దేశానికి అమూల్య సేవలు అందించారని అన్నారు. సమానత్వం కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి జనార్ధన్, సభ్యులు చంద్రశేఖర్, రామయ్య, నారాయణరెడ్డి, పృధ్వి, మధు, సూర్య పాల్గొన్నారు.

# మిట్నాలలో రైతులకు పి.ఎం.డి.ఎస్ కిట్లు పంపిణీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 14: నంద్యాల మండలంలోని మిట్నాల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు రైతులకు పి.ఎం.డి.ఎస్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా 25?30 రకాల విత్తనాలతో తయారైన ఈ కిట్లను తొలకరి వర్షాల వెంటనే విత్తాలని సూచించారు. ఈ పద్ధతి వల్ల భూమి పచ్చదనం పెరిగి, సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెందడంతో పాటు నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. 35?45 రోజుల్లో దున్నితే ఖరీఫ్ పంటలకు సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఎల్నినో ప్రభావాన్ని తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుందని పేర్కొన్నారు.మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కిట్లు అందజేసి రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 14-నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంబేద్కర్ మహామేధావి, సంఘసంస్కర్తగా దేశానికి అపార సేవలు అందించారని చెప్పారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించి సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు కృషి చేశారన్నారు. మహిళలకు హక్కులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.యూనిఫాం సేవల్లో ఉన్నవారు కుల, మత భేదాలు లేకుండా అంబేద్కర్ చూపిన మార్గంలో నడిచి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190